జీఎమ్మార్ ఎరీనాలో నేడు 10కే మారథాన్

» హాజరుకానున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 9 : శంషాబాద్ విమానాశ్రయంలోని జీఎమ్మార్ ఎరీనాలో నేడు 10కే మారథాన్ నిర్వహించనున్నట్లు అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండ్ ఏవియేషన్ సెక్యూరిటీ కల్చర్ వీక్-2024 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మారథాన్ నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.


గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయాలనే ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక ప్రజలు భగ్గుమంటున్నారు. తమ గ్రామాలను మున్సిపాలిటీలో చేర్చవద్దని.. పంచాయతీలుగా ఉండడమే లాభమని చెబుతున్నారు. కనీస వసతులు కూడా లేని గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడం వల్ల తమకు లాభం లేకపోగా ఇంటి, నీటి పన్నులు పెరిగి తమపై ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ఇప్పటికే ఆ గ్రామాల ప్రజలు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఇక, దీనికి వ్యతిరేకంగా కార్యాచరణ చేపట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ స్థానికుల అభిప్రాయాలు సేకరిస్తోంది.

45 గ్రామాల విలీనంపై ప్రజల్లో వ్యతిరేకత

» పన్నులు పెరుగుతాయని ఆందోళన

» అధికారులకు గ్రామస్తుల వినతిపత్రాలు

» మున్సిపాలిటీల విలీనంపై కూడా అభ్యంతరాలు



విలీన ప్రతిపాదిత గ్రామాలు (ఎరుపు రంగులో)

పంచాయతీనే ముద్దు

జీహెచ్ఎంసీ వద్దు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

హైదరాబాద్ నగర శివార్లలోని కొన్ని గ్రామాలతో పాటు మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని తీసుకున్న నిర్ణయం పట్ల కొన్ని ప్రాంతాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. హైదరాబాద్ మహానగరాన్ని మరింత విస్తరించేందుకు ఔటర్ రింగు రోడ్డుకు ఆనుకొని ఉన్న 45 గ్రామాలను ముందుగా సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసి ఆ తరువాత గ్రేటర్‌లో కలిపేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఇప్పటికే రూట్‌మ్యాప్ కూడా సిద్ధం చేశారు. ఈ గ్రామాల్లో పంచాయతీ ఎన్నికలు కూడా నిర్వహించరాదని సర్కార్ నిర్ణయించి ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే సర్కార్ నిర్ణయంపై స్థానికంగా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వ నిర్ణయంపై పోరాడేందుకు కొందరు సిద్ధమవుతున్నారు. శివారు ప్రాంతాల్లోని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలను విలీనం చేయడంతో లక్షలాది మందిపై పన్నుల భారం పెరగనుంది. ఇంటిపన్నుతో పాటు వాటర్ బిల్లులు పెరుగుతాయి. ఇప్పటికీ అనేక గ్రామాల్లో సరైన మౌలిక సదుపాయలు లేవు. ఇటీవల కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో కూడా ఇప్పటి వరకు మౌలిక సదుపాయాలు లేవు. అలాంటిది పంచాయతీలను విలీనం చేస్తే తమకు కొత్తగా ఒనగూరిదేమీ ఉండదని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి జీహెచ్ఎంసీలో విలీనం వల్ల ఇంటిపన్ను అమాంతంగా అనేక రెట్లు పెరుగుతుంది. దీంతో అనేక గ్రామాల ప్రజలు ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాల ప్రజలు అధికారులను కలిసి తమ గ్రామాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేయవద్దని, యథావిధిగా కొనసాగించాలని వినతి పత్రాలు అందజేస్తున్నారు. గ్రామాల్లో రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని.. ఇపుడు గ్రామాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే పన్నుల భారం భరించడం కష్టమని వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే గ్రామకంఠంపై కట్టే ఇళ్లకు పంచాయతీల్లో ఇంటి నంబర్లు ఇవ్వడం లేదు. జీహెచ్ఎంసీలో విలీనం తరువాత ఇలాంటి వాటి విషయంలో ఏం చేస్తారో తెలియడం లేదు. తొలుత ఈ గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసే తరువాత వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి ఈ ప్రాంతాలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తామని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. అయితే గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. తొలుత శివారు పంచాయతీలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి ఆ ప్రాంతాలు కొంతమేర అభివృద్ధి చేసిన తరువాత కొన్ని సంవత్సరాలకు జీహెచ్ఎంసీలో విలీనం చేశారు. అయితే ఇపుడు ప్రభుత్వం పల్లెల్లో ఎలాంటి మౌలిక సదుపాయాలూ కల్పించకుండానే ఏడాది కాలంలోనే జీహెచ్ఎంసీలో 45 గ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించడంపై విమర్శలు వస్తున్నాయి. అలాగే శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంపై కూడా కొన్ని ప్రాంతాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా కొందరు గట్టిగా పోరాడేందుకు సిద్ధమవుతున్నారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాలని భావిస్తున్నారు. ప్రతిపక్ష బీఆర్ఎస్ కూడా దీనిపై స్థానిక నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. మాజీ మంత్రి సబితారెడ్డి తనయుడు కార్తీక్‌రెడ్డి శివార్లలోని గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకుంటున్నారు. దీనిపై త్వరలోనే కార్యాచరణ మొదలు పెట్టేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఇదిలా ఉంటే అధికార పార్టీకి చెందిన స్థానిక నేతలు కూడా సర్కార్ నిర్ణయంపై బహిరంగంగా మాట్లాడకపోయినప్పటికీ దీన్ని వ్యతిరేకిస్తున్నారు.



విలీన గ్రామాల వివరాలు

మున్సిపాలిటీ	విలీన గ్రామాలు
మేడ్చల్ జిల్లా పరిధిలో 23 గ్రామాలు	
ఘట్‌కేసర్	మర్రిపల్లిగూడ, ఏదులాబాద్, ఘనాపూర్,
నాగారం	కీసర, రాంపల్లి దాయర, యాద్గార్‌పల్లి, చీర్యాల
తూంకుంట	బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట
మేడ్చల్	రాయిలాపూర్, పూడూరు
గుండ్లపోచంపల్లి	గౌడవెల్లి, మునీరాబాద్
దమ్మాయిగూడ	తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, కరీంగూడ, గోధుమకుంట
పోచారం	చౌదరిగూడ, వెంకటాపూర్, కాచవాని సింగారం, కొర్రెముల, ప్రతాప్‌సింగారం
రంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలు	
పెద్ద అంబర్‌పేట	కుత్బుల్లాపూర్, తారామతి పేట, గౌరెల్లి, బాచారం
శంషాబాద్	రషీద్‌గూడ, బహదూర్‌గూడ, హమీదుల్లానగర్, చిన్న గోల్కొండ, పెద్ద గోల్కొండ
శంకర్‌పల్లి	మీర్జాగూడ
తుక్కుగూడ	హర్షగూడ
సంగారెడ్డి జిల్లా పరిధిలో 11 గ్రామాలు	
అమీన్‌పూర్	ఐలాపూర్, ఐలాపూర్ తండా, కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ, దాయర, సుల్తాపూర్
పటాన్‌చెరు	పోచారం, ముత్తంగి, కార్ధనూర్, పాటి, ఘనాపూర్

మున్సిపాలిటీల్లో విలీన ప్రక్రియ దాదాపు పూర్తి

ఔటర్‌కు ఆనుకుని ఉన్న 45 గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియ నిలిపివేసి వీటిని పురపాలక సంఘాల్లో విలీనం చేసే ప్రక్రియను ప్రభుత్వం దాదాపు పూర్తి చేసింది. పురపాలికల్లో విలీనమయ్యే గ్రామాలు మేడ్చల్ జిల్లా పరిధిలో అధికంగా ఉన్నాయి. మేడ్చల్ జిల్లాలో 23 గ్రామాలు ఏడు పురపాలికల్లో విలీనం చేస్తున్నారు. అలాగే రంగారెడ్డి జిల్లాలోని నాలుగు పురపాలికల్లో 11 గ్రామాలను విలీనం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో రెండు పురపాలికల్లో 11 గ్రామాలు విలీనం కానున్నాయి.

రైతులకు అండగా ఉంటాం

» నిషేధిత భూముల జాబితాను సీఎం దృష్టికి తీసుకెళ్తాం

» కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



యాచారంలో రైతులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం, ఆగస్టు 9 : రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి కుర్మిద్ద గ్రామాల్లో గత ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టిన భూములను రైతుల పేరిట ఆన్‌లైన్ చేసి సంక్షేమ పథకాలు రైతులకు అందేట్లు కృషి చేస్తామని చెప్పారు. ఈమేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌లతో సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు అండగా ఉంటామని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన యాచారంలో రైతులతో సమావేశమయ్యారు. మేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్, తాటిపర్తి గ్రామాలకు చెందిన పలువురు రైతులు కోదండరెడ్డిని కలిసి తమకు న్యాయం చేయాలని కోరారు. మాకందరికీ ఎకరం, రెండెకరాల సాగు భూమి ఉందని, ఆ భూములను క్రయ విక్రయాలకు తావు లేకుండా గత ప్రభుత్వం మా నోట్లో మట్టి కొట్టిందని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో ఎంతగానో కృషి చేశామని, భారీ ఆధిక్యత ఇచ్చామనే విషయం మరువరాదని రైతులు ఆయనతో అన్నారు. పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడంతో.. భూమి ఉండి కూడా ఏమీలేని వారిగా మిగిలామని పలువురు రైతులు వాపోయారు. మాకు భూమికి బదులు భూమి ఇవ్వాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని ఖరాఖండిగా చెప్పారు. మొండిగా వ్యవహరించి భూములు తీసుకుంటే ఆందోళనకు దిగుతామని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి మాగోడు వివరించి ఆదుకోవాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ తాను స్వతహాగా రైతునే అన్న విషయం మరువరాదని అన్నారు. ఈ విషయమై న్యాయ నిపుణులతో మాట్లాడినట్లు ఆయన వెల్లడించారు. సెంటు భూమి కూడా ప్రభుత్వం తీసుకోకుండా తాను రైతుల పక్షాన నిలబడి ఆదుకుంటామని చెప్పారు. ఎంపీ, ఎమ్మెల్యేలు కూడా ఎందుకు న్యాయం చేయలేకపోతున్నారని రైతులు ప్రశ్నించారు. మాకు న్యాయం చేయనప్పుడు గత ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి తేడాలేదని, ఈ ప్రభుత్వం కూడా ఫార్మాసిటీ కోసం తీసుకున్న భూములు కాకుండా మా పట్టా భూములను నిషేధిత జాబితాలో పెట్టడం అంటే.. మా హక్కులను హరించడమేనని కోదండరెడ్డికి విన్నవించారు. కార్యక్రమంలో కుర్మిద్ద మాజీ సర్పంచ్ బి.రాజశేఖర్‌రెడ్డితో పాటు మహిపాల్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ప్రతిమాసింగ్

శంకర్‌పల్లి, ఆగస్టు9: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం మోకిలలోని రైతువేదిక వద్ద శుక్రవారం ఎంపీడీఓ వెంకయ్యగౌడ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆమె శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌లో మొక్కలు నాటారు. శంకర్‌పల్లి పట్టణంలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. డంపింగ్ యార్డుకు స్థలం సరిపోవడం లేదని కమిషనర్ శ్రీనివాస్ ఆమె దృష్టికి తీసుకు రాగా తహసీల్దార్‌కు మున్సిపాలిటీ తరఫున లెటర్ అందజేస్తే పరిశీలించి స్థలాన్ని కేటాయిస్తామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి అంబేద్కర్ భవన్ వద్ద ఇంతకుముందు డబ్బాలు వేసుకుని దుకాణాలు నడుపుకున్న వారికే షాపులను కేటాయించాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏడీఏ రమాదేవి, ఎంపీవో రాజు, ఎంఈఓ అక్బర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి, కౌన్సిలర్ లక్ష్మమ్మ రాంరెడ్డి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, ఏపీఎం భీమయ్య, ఏపీఓ నాగభూషణం, ఏఈఓ రామకృష్ణారెడ్డి, మోకిల పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి ప్రమీల, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్డ్ స్కీమ్ పేరిట ఘరానా మోసం

» అధిక వడ్డీకి డబ్బులు తీసుకొని కుచ్చుటోపీ » రూ.3కోట్లతో ఉడాయించిన నగల వ్యాపారి

» లబోదిబోమంటున్న బాధితులు » షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగులోకి..

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 9: గోల్డ్ స్కీమ్ పేరుతో ప్రజలను నమ్మించడమే కాకుండా.. అధిక వడ్డీ ఇస్తానని అప్పు తీసుకొని దాదాపు రూ.3 కోట్లతో ఉడాయించిన నగల వ్యాపారి ఉదంతం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం కొందుర్గు మండలం ఆగిర్యాల గ్రామానికి ఎందిన నరేష్ అనే బంగారు నగలు తయారు చేసే వ్యాపారి.. మొదట షాద్‌నగర్‌లోని హాజీపల్లి రోడ్డులో చిన్నపాటి కిరాణ దుకాణం పెట్టుకున్నాడు. అనంతరం షాద్‌నగర్‌లోని తిరుమల కాలనీలో నగలు తయారు చేసే దుకాణం ప్రారంభించాడు. ఈక్రమంలో ఏర్పడిన పరిచయాలతో గోల్డ్ స్కీమ్ పేరిట తెలిసిన వారి వద్ద నెలనెలా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.వెయ్యి చొప్పున 20 నెలలు కట్టించుకున్నాడు. అంతేగాకుండా మరికొందరి వద్ద ఎక్కువ వడ్డీ చెల్లిస్తానని లక్షల్లో అప్పు తీసుకున్నాడు. షాద్‌నగర్‌కు చెందిన నర్సింహులు హైదరాబాద్ ఆర్టీసీలో పని చేస్తున్నాడు. నరేష్ కిరాణా దుకాణం అతడి ఇంటికి సమీపంలో ఉండటంతో పరిచయం వారిద్దరి మధ్య పరిచయం పెరిగింది. ఇదే అదనుగా భావించిన నరేష్ నర్సింహులు వద్ద రూ.7 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. అదేవిధంగా విద్యుత్ శాఖలో పని చేసే ఓ ఉద్యోగిని గోల్డ్ స్కీమ్ కోసమని రూ.60 వేలు కట్టింది. ఆగస్టుతో స్కీమ్ గడువు ముగిసినా ఆమెకు డబ్బులు అందలేదు. తిరుమల కాలనీకి చెందిన ఓ గృహిణి ఆభరణాలు చేయించుకునేందుకు బంగారం కొనుగోలు చేద్దామని రూ.4 లక్షలు ఇచ్చింది. ఓ చికెన్ వ్యాపారి తన కూతురు పెళ్లికోసం దాచుకున్న రూ.2లక్షలను నరేష్ మాయమాటలు చెప్పి అధిక వడ్డీ ఇస్తానని నమ్మించాడు. అయితే, నరేష్ షాద్‌నగర్ పట్టణ శివారులోని ఓ గేటెడ్ కమ్యూనిటీ వెంచర్‌లో ఇల్లు కొనుగోలు చేసి దానిని గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకున్నట్లు బాధితులు తెలిపారు. షాద్‌నగర్‌లోని రెండు దుకాణాల పేరుతో ఓ బ్యాంక్‌లో రూ.20 లక్షలు రుణం తీసుకున్నట్లు సమాచారం. అలాగే రూ.2, 3లక్షలకు చిట్టీలు వేసి.. ఏ ఒక్కరికి కూడా డబ్బులు ఇవ్వకుండా పరారైనట్లు బాధితులు తెలిపారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.



తాళంవేసి ఉన్న దుకాణం

నమ్మించి మోసం చేశాడు



నరేష్ అనే వ్యక్తి బంగారు నగలు తయారీ పేరుతో నమ్మకంగా ఉండి పరిచయం పెంచుకున్నాడు. నా వద్ద రూ.7లక్షలు తీసుకున్నాడు. రూ.3 లక్షల చేతికిచ్చి, రూ.లక్ష ఫోన్ పే ద్వారా చెల్లించాను. మరో రెండు లక్షల చిట్టీ కట్టించుకున్నాడు. 20 వేల స్కీమ్ కట్టాను. అప్పుడప్పుడు అవసరం ఉన్నాయని చేబదులుగా మరికొంత డబ్బు తీసుకున్నాడు. నాతో పాటు చాలామంది వద్ద డబ్బులు తీసుకున్నాడు. బాధితులమంతా పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

నర్సింలు, ఆర్టీసీ ఉద్యోగి, షాద్‌నగర్

వైభవంగా నాగుల పంచమి



ఆమనగల్లు : మైసిగండి ఆలయంలోని పుట్టలో పాలుపోసి మొక్కుతున్న మహిళలు

శ్రావణ మాస ప్రారంభంలో వచ్చే మొదటి పండుగ నాగుల పంచమి. ఈ వేడుకలను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో పుట్టల వద్దకు వెళ్లి నాగదేవతకు పాలుపోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబాలను చల్లంగా చూడాలని నాగదేవతలను వేడుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

- ఆమనగల్లు, ఆగస్టు 9

ధరణి పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

యాలాల, ఆగస్టు 9: ధరణి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా నాయకులు ఉప్పలి మల్కయ్య అన్నారు. యాలాల మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తంచేసి తహసీల్దార్ అంజయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నర్సిములు, కృష్ణ, డి.నర్సింహులు, కమలాపురం నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్ర మైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేదీ ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ


అనిరుధ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికీ 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ చైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

కేంద్రానివి ప్రజా వ్యతిరేక విధానాలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 9: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని జిల్లా రైతు సంఘం కార్యదర్శి మదుసూధన్‌రెడ్డి ఆరోపించారు. క్విట్‌ఇండియా ఉద్యమ స్ఫూర్తితో బీజేపీ వ్యతిరేక విధానాల నుంచి దేశాన్ని కాపాడుకునేందుకు ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరముందన్నారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజీవ్‌చౌక్ వద్ద కొద్దిసేపు ధర్నా నిర్వహించారు. మదుసూధన్ రెడ్డి మాట్లాడుతూ మోదీ సర్కార్ కార్పొరేట్లకు కోసం దేశ ప్రయోజనాలను తాకట్టు పెడుతుందని మండిపడ్డారు. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కానుగుల వెంకటయ్య, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నయ్య, పెంటయ్య, సీఐటీయు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి రథోత్సవం


రథోత్సవంలో కేరళావాయిద్యాల నడుమ భక్తుల నృత్యాలు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 9: మండల పరిధి ఎదులాబాద్‌లోని శ్రీగోదా సమేత శ్రీమన్నార్ రంగనాయకస్వామి బ్రహోత్మవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం దివ్య విమాన ర థోత్సవ ఊరేగింపు అంగరం గ వైభవంగా జరిగింది. స్వామివారి రథాన్ని రంగురంగుల విద్యుద్దీపాలు, అరటికొమ్మలతో సుందరంగా ముస్తాబుచేశారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మాజీ జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, హరివర్ధన్‌రెడ్డిలు దివ్యవిమాన రథానికి ప్రత్యేక పూజలు చేశారు. రథాన్ని ముందుకు లాగి ప్రారంభించారు. అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేకపూజలు చేశారు. భక్తుల కోలాహలంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీ య ఘటనలు తలెత్తకుండా సీఐ సైదులు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బట్టె శంకర్, నాయకులు వేముల మహేష్‌గౌడ్, కందులకుమార్, విశ్వనాథం, రామోజీ, సుధాకర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, సావల్ సురేష్, కర్రె రాజేష్, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఓం ప్రకాష్, రాజేందర్‌గౌడ్, జనార్దన్ పాల్గొన్నారు.


రథోత్సవంలో పాల్గొన్న అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, తోటకూర వజ్రేష్‌యాదవ్

ఆదివాసుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి
- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


ఆమనగల్లులో కొమురంభీం విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు/కడ్తాల్, ఆగస్టు 9: ఆదివాసుల హక్కుల పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి, ఆత్మగౌరవం పెంపునకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్‌కార్యాలయం ఆవరణలో శుక్రవారం చెంచు సేవా సంఘం రాష్ట్ర నాయకుడు మండ్లీ రాములు ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసం దినోత్సవం అట్టహసంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, రాష్ట్ర కాలుష్య నియంత్రణమండలి సభ్యుడు బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చెంచు సేవా సంఘం నాయకులు, చెంచులు, వివిధ పార్టీల నేతలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కసిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చెంచుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. వైస్ చైర్మన్ దుర్గయ్య, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, చేనేత సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, నాయకులు అప్పం శ్రీను, నిట్ట నారాయణ, కాలె మల్లయ్య, వస్పుల మానయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని కడ్తాల్ గిరిజన బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రాములు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి, డీటీడీవో రామేశ్వరి దేవిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొమురంభీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తహసీల్దార్ ముంతాజ్, ఎంపీడీవో సుజాత, మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్, శంకర్, శేఖర్‌గౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపుతున్న సింగరేణిరిటైర్డ్ ఉద్యోగులు

ఘట్‌కేసర్, ఆగస్టు 9: అనేక సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపించారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ పోస్టాఫీసు వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాల గాలి, వెలుతురులేని బొగ్గుబావుల్లో పనిచేసి రిటైర్డ్ అయిన తమకు అతితక్కువ పింఛన్ అందిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చే అరకొర పింఛన్ వైద్య ఖర్చులకైనా సరిపోవడం లేదన్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు తెల్లరేషన్ కార్డులతోపాటు ఆసరా పింఛన్లు, అన్ని రకాల ఉచిత వైద్యం, 200వందల చదరపు గజాల ఇంటి స్థలం లేదా ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నిర్వాహకులు అళవందార్ వేణుమాధవ్, కనకయ్య, రాజయ్య, వెంకటస్వామి, రాజిరెడ్డి, మురళీకృష్ణ, మదనయ్య, సమమయ్య, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల అవకతవకలపై విచారణ

ప్రజావాణిలో ఫిర్యాదుతో స్పందించిన అధికారులు


విచారణ జరుపుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, ఆగస్టు 9: బిజ్వార్ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని గ్రామానికి చెందిన కొంతమంది ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌తో కలిసి ఏపీవో నరోత్తంరెడ్డి సమక్షంలో విచారణ జరిపారు. తాండూరు మండ లం బిజ్వార్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేసిన వారిని పంచాయతీ కార్యాలయానికి పిలిచి ఫీల్డ్‌అసిస్టెంట్ స్వరూపాను విచారించారు. అయితే కొంతమంది ఉపాధి హామీ పథకం పనులు చేపట్టేందుకు 187మందికి జాబ్‌కార్డులు ఇచ్చామని, అందులో 150 మంది వరకు పనుల్లోకి వస్తారని ఆమె పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూపా భర్త పనుల్లో జోక్యం చేసుకుని కూలి తక్కువ రాసే ప్రయత్నం చేస్తున్నారని కొంతమందికి కూలీలు పేర్కొన్నారు. ఎంపీడీవో స్పందిస్తూ ఇప్పటి నుంచి ఉపాధి హామీ పనుల వద్దకు ఫీల్డ్ అసిస్టెంట్ స్వరూప వెళ్లాలని ఆదేశించారు. నిధులు లేక కూలి మే 19వ తేదీ వరకే వారి ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. ఎల్మకన్నె సహకార బ్యాంకు డైరెక్టర్ అనంతమ్మ, చంద్రప్పలు మాట్లాడుతూ.. కోమటికుంట, కానుగకుంట, సీతకుంటలో ఉపాధి హామీ పనులు చేపట్టామని, అట్టి పనులకు సంబంధించి 74మంది కూలీలకు డబ్బులు రావాల్సి ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఉపాధి హామీ పనుల పర్యవేక్షణలో టెక్నికల్ అసిస్టెంట్ భూపతి, బిజ్వార్ గ్రామంలో పనులు కొనసాగేటప్పుడు పర్యవేక్షించకపోవడం వల్లే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కొందరు కూలీలు వాపోయారు. ఈ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని అధికారులు వెల్లడించారు.

హెచ్ఎండీఏలో మేడ్చల్ జోన్ విభజన

మేడ్చల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నగరశివారు చుట్టూ విస్తరించి ఉన్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మేడ్చల్ జోన్ రెండుగా విభజిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో హెచ్ఎండీఏ పరిధిలో ఇప్పటి వరకు ఘట్‌కేసర్, మేడ్చల్ జోన్లు ఉండగా ఘట్‌కేసర్ జోన్‌ను యథావిధిగా ఉంచి, మేడ్చల్‌ను రెండు జోన్‌లుగా విభజించారు. త్వరలో ఆర్‌ఆర్‌ఆర్ మొత్తం హెచ్ఎండీఏ పరిధిలోకి తెచ్చేందుకు ప్రణాళికలో భాగంగా మేడ్చల్‌ను రెండుగా విభజించినట్లు తెలిసింది. మేడ్చల్‌జోన్ పరిధి ఎక్కువగా ఉండటంతో సేవల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. జోన్‌ను విభజించి అదనపు సిబ్బంది నియామకానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. మేడ్చల్ జోన్-1లో బాచుపల్లి, గుండ్లపోచంపల్లి, నర్సాపూర్, శామీర్‌పేట, శివంపేట్, తూప్రాన్, మనోహరాబాద్ ప్రాంతాలు ఉండగా, మేడ్చల్‌జోన్-2లో కొంపల్లి, మేడ్చల్, పీఎఫ్‌యూ, గ్రిడ్‌రోడ్, ఉప్పల్ భగాయత్, దుండిగల్, గండిమైసమ్మ, ములుగు, వర్గల్, కాప్రా ప్రాంతాలున్నాయి. మేడ్చల్‌జోన్-1 ప్లానింగ్ అధికారికగా గోపిక రమ్య, మేడ్చల్ జోన్-2 ప్లానింగ్ అధికారిగా కె.శాలినిలకు బాధ్యతలు అప్పగించారు.

విధులు బాధ్యతగా నిర్వర్తించాలి


చేవెళ్లలో మాట్లాడుతున్న డీడీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, ఆగస్టు9: విధులు బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని చేవెళ డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ తెలిపారు. శుక్రవారం చేవెళ్ల డివిజన్ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. చేవెళ్ల డివిజన్‌లో పూర్తిస్థాయిలో వైద్యసిబ్బంది బదిలీలు జరిగాయన్నారు. ప్రభుత్వ వసతి గృహల్లోని విద్యార్థులకు సైతం వైద్యులు అందుబాటులో ఉండి వైద్యం అందించాలన్నారు. శుక్ర, సోమవారాల్లో గర్భిణీలకు వైద్య పరీక్షలు చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఓపీల సంఖ్య పెంచాలన్నారు. సీహెచ్‌వో సంతోష, అధికారి బలరాం, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొందుర్గు, ఆగస్టు 9: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 33 మంది లబ్దిదారులకు చెక్కులు అందజేశారు. ఎంపీడీవో అనురాధ, తహశీల్దార్ రమేష్ కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, కె.రామయ్య గౌడ్, కావలి యాదయ్య, సయ్యద్ సాధిక్, సి.కృష్ణయ్య, బి.నరేందర్, ఆర్.రామస్వామి, గోవర్ధన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులకు అండగా ఉండండి


కేటీఆర్ పుష్పగుచ్ఛం ఇస్తున్న రాంబల్‌నాయక్

కేశంపేట, ఆగస్టు 9: ఆదివాసులకు అండగా ఉండాలని లం బాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు మూడావత్ రాంబల్ నాయక్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివాసీ హక్కుల పోరాటంలో కలిసి రావాలని కోరగా.. కేటీఆర్ సానుకూలంగా స్పందించారని రాంబల్ నాయక్ తెలిపారు.

నాగుల పంచమి.. నాగదేవతకు పూజలు

● మహిళా భక్తులతో ఆలయాలు కిటకిట



చేవెళ్ల : శివాలయంలో మహిళల పూజలు



మొయినాబాద్: పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

ఆమనగల్లు/కడ్తాల్, ఆగస్టు 9 : శ్రావణ మాస ప్రారంభంలో వచ్చే మొదటి పండుగ నాగుల పంచమి వేడుకలను శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల పరిధిలోని ఆయా గ్రామాలలో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు ఆలయాలు, పట్టణ, గ్రామాల సమీపాలలో గల పుట్టల వద్ద పూజలు నిర్వహించి నాగదేవతలకు పాలుపోశారు. తమతమ కుటుంబాలను చల్లంగా చూడాలని నాగదేవతలను వేడుకున్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో జరిగిన నాగుల పంచమి వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పుట్ట వద్ద నాగదేవతకు పూజలు నిర్వహించారు. మైసిగండి మైసమ్మ దేవాలయ ఫౌండర్‌ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత ల ఆధ్వర్యంలో భక్తులకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్‌లో గరుడ పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం ఎదుట గరుడ, ఆంజనేయ స్వామి ఏకశిల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నరేందర్ ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖులచే పూజారి శ్రీనివాసాచార్యులు పూజలు చేయించి, తీర్థ ప్రసాదాలను ఇచ్చారు. అనంతరం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం అన్నదానం కోసం ఏర్పాటు చేసిన పెద్దజానమ్మ అన్నప్రసాద నిలయాన్ని న్యాయవాది జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభింప జేశారు. మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వం, కమిషనర్ వెంకన్న, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : గరుడ పూజలో ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు బక్కని, ప్రతాప్‌రెడ్డి



మొయినాబాద్ : ప్రత్యేక అలంకరణలో చిలుకూరు సుందరేశ్వరుడు

చేవెళ్ల : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసి నాగదేవతలకు పూజలు నిర్వహించారు. పూలు, పండ్లు, పాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మొయినాబాద్ : మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో మహిళలు పుట్టలకు ప్రత్యేక పూజలు చేశారు. సల్లంగా చూడాలంటూ నాగదేవతలను వేడుకున్నారు. ఉదయం నుంచే గ్రామాల్లో ఉన్న పుట్టల వద్దకు వెళ్లి పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో చిలుకూరు బాలాజీ ఆలయం ఆవరణలోని సుందరేశ్వరుని శివలింగాన్ని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు పూజలు నిర్వహించారు.

శంకర్‌పల్లి : నాగుల పంచమిని మండల ప్రజలతో పాటుగా మున్సిపాలిటీ పరిధిలో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు పుట్టలో పాలు పోశారు. నాగదేవతను ఘనంగా పూజించారు. చైర్‌పర్సన్ విజయలక్ష్మి పుట్టలో పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

షాబాద్ : తాళ్లపల్లి, షాబాద్, నాగర్‌గూడ, సర్దార్‌నగర్, హైతాబాద్, బొబ్బిలిగామ, లింగారెడ్డిగూడ తదితర గ్రామాల్లో నాగుల పంచమి వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. మహిళలు నాగుల పుట్టలో పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మొయినాబాద్ : మండలంలో నాగుల పంచమిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు గ్రామాల్లో పుట్టల వద్ద పూజలు చేసి పాలు పోశారు. గ్రామాల్లోని ఆలయాల్లో పుట్టల వద్ద పూజలు చేశారు.

శంషాబాద్ : మున్సిపాలిటీలోని వివిధ బస్తీల్లో నాగుల పంచమిని జరుపుకున్నారు. మహిళలు శ్రీ వెండికొండ సిద్దేశ్వరసామి (సిద్దులగుట్ట) ఆలయ సమీపంలో ఉన్న పాముల పుట్టల్లో పాలు పోసి పసుపుకుంకుమలతో అందంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పుట్ట మీద పేలాలు నైవేద్యం సమర్పించారు. దేవాలయం ఎదుట ఉన్న నాగదేవల విగ్రహాలకు పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

యాచారం, ఆగస్టు 9: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం సాయంత్రం చిన్నతూండ్ల గ్రామానికి చెందిన యశమోని రాఘవేందర్ పెద్దతూండ్ల నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా.. ఎదురుగా వస్తున్న జక్కుల బాబు బైక్‌ను ఢీకొట్టాడు. దాంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనాయి. బాబు కాలు విరిగింది. పెట్రోమొబైల్-1 పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అదృశ్యం



మల్లేష్

యాచారం, ఆగస్టు 9 : భార్యపై అలిగి ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మీర్‌ఖాన్‌పేటకు చెందిన బండ మల్లేష్ రెండు రోజులక్రితం పొలం పనులకు వెళ్లాడు. ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా జాడ తెలియలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

ఆసుపత్రిలో మహిళ మృతి

● వైద్య వికటించిందని కుటుంబ సభ్యుల ఆందోళన



మృతిచెందిన సావిత్రి

మొయినాబాద్, ఆగస్టు 9 : కాలు విరిగిందని వైద్యనిమిత్తం ఆసుపత్రిలో చేరిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. గ్రామస్తులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అమడాపూర్‌కు చెందిన మద్దెపాగ సావిత్రి (30) ఐదు రోజుల క్రితం కిందపడటంతో కాలికి గాయమైంది. కుటుంబ సభ్యులు భాస్కర ఆసుపత్రిలో చేర్పించారు. కాలు విరిగిందని శుక్రవారం ఆపరేషన్ చేస్తామని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. సాయత్రం వరకు బయటకు తీసుకురాలేదు. కుటుంబ సభ్యులు వైద్యులను అడిగితే పొంతనలేని సమాధానం చెప్పారు. లోపలికి వెళ్లి చూసేసరికి సావిత్రి అపస్మారక స్థితిలో ఉంది. డాక్టర్లను గట్టిగా అడగడంతో మృతిచెందినట్లు తెలిపారు. దాంతో డాక్టర్ల నిర్లక్ష్యం మూలంగానే సావిత్రి మృతి చెందిందని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు.

కూలిన పాఠశాల పిట్టగోడ, జెండా దిమ్మె

● విద్యార్థులు క్లాస్ రూంలో ఉండటంతో తప్పిన ప్రమాదం

● రంగారెడ్డి జిల్లా రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఘటన

● ఆందోళన వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



రావిర్యాల పాఠశాలలో కూలిన పిట్టగోడ, దెబ్బతిన్న సజ్జ, కిందపడిన ఇటుకలు, జెండా

చౌదరిగూడ, ఆగస్టు 9 : ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనం పిట్టగోడ కూలిన ఘటన రావిర్యాలలో శుక్రవారం చోటుచేసుకుంది. రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాల భవనం పిట్టగోడ(పరదా గోడ)పై జాతీయ జెండా కోసం గద్దెను ఏర్పాటు చేశారు. ఉన్నట్టుండి శుక్రవారం పిట్టగోడతో పాటు జెండా గద్దె కూలింది. దాంతో ఇటుకలు కిందివైపు పక్కనే ఉన్న సజ్జపై పడటంతో అదికూడా కొద్దిభాగం కూలింది. ఇటుకలు జెండా కిందపడ్డాయి. అయితే, ఆ సమయంలో పాఠశాలలో 111 మంది విద్యార్థులు ఉన్నారు. వారంతా తరగతి గదుల్లో ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని, ఎప్పుడు కూలిపోతుందో చెప్పలేని పరిస్థితి నెలకొందని, ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు తరగతి గదుల్లో కూర్చోవాలంటే భయపడుతున్నారని వాపోతున్నారు.

జోరుగా 'స్వచ్ఛదనం-పచ్చదనం'



శంషాబాద్ రూరల్ : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, కలెక్టర్ శశాంక

శంషాబాద్ రూరల్, ఆగస్టు 9 : స్వచ్ఛదనం-పచ్చదనం ప్రజల జీవితంలో భాగం కావాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మల్కారం ఫారెస్ట్ భూముల్లో కలెక్టర్ శశాంకతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే మొక్కలను విరివిగా పెంచాలని కోరారు.

యాచారం : కాలుష్యనివారణకు ప్రతీ వ్యక్తి నాలుగు మొక్కలు నాటిల్సిందేనని డీఆర్‌డీవో శ్రీలత కోరారు. గున్‌గల్, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పర్యటించి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గున్‌గల్‌లో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, డివిజన్ ఏపీడీ సక్రియానాయక్‌తో కలిసి మొక్కలు నాటారు. యాచారం, చౌదర్‌పల్లి, చిన్నతూండ్ల, కుర్మిద్ద తదితర గ్రామాల్లో మురుగు కాలువలను కార్యదర్శులు శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు మొక్కలు నాటారు. ఎంపీవో శ్రీలత, ఏపీవో లింగయ్య తదితరులున్నారు.

ఇబ్రహీంపట్నం : జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీలో ఆరు వేల మొక్కలకు తగ్గకుండా మొక్కలు నాటాలని జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. ఏదైనా చిన్న గ్రామ పంచాయతీ ఉన్నప్పటికీ మండలం యూనిట్‌గా తీసుకుని అనుకున్న లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. పోల్కంపల్లి, నెర్రెపల్లి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి నవీన్‌కుమార్‌రెడ్డితో కలిసి మొక్కలు నాటారు. పంట పొలాల్లో గట్లపై ఆదాయాన్నిచ్చే విదంగా పండ్ల మొక్కలు, టేకు, మహాగని, మలబార్, వేప మొక్కలు నాటుకోవాలని రైతులకు సలహా చేశారు. ఎంపీడీవో వెంకటమ్మ, ఎంపీవో లక్పతినాయక్, ఏపీవో తిరుపతాచారి, ఈసీ రవికుమార్ తదితరులున్నారు. ఇబ్రహీంపట్నం టౌన్ సాయిరాంనగర్ కాలనీలో అటవీ శాఖ, మున్సిపల్ అధికారులు మొక్కలు నాటారు. అటవీ శాఖ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతి, కమిషనర్ రవీందర్ కుమార్, వైస్ చైర్మన్ బర్ల మంగలతో కలిసి మొక్కలు నాటారు. డిప్యూటీ రేంజ్ అధికారి కస్నానాయక్, సెక్షన్ అధికారులు నర్సింహ, చంద్రశేఖర్, బీట్ ఆఫీసర్లు మహేందర్, జంగారావు, కౌన్సిలర్ మోహన్‌నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్ : ఉద్యమస్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీవో సుజాత, ఏపీవో రాజేశ్వరిలు కోరారు. కడ్తాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థినిలు,ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. నాయకులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, యాట నర్సింహ, చేగూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : పట్టణంలోని జడ్పీ బాలికల, బస్టాండ్ బాలుర ఉన్నత పాఠశాలల్లో కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, కమిషనర్ వసంతలు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయులు పద్మజారెడ్డి, రామలక్ష్మి, తదితరులున్నారు.

మాడ్గుల : మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఎంపీడీవో పద్మావతి ఆధ్వర్యంలో చేపట్టి ర్యాలీ నిర్వహించారు. అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : వన మహోత్సవంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని స్పెషల్ ఆఫీసర్ రామారావు తెలిపారు. ఫరూక్‌నగర్ మండలం రాయికల్‌లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో బన్సిలాల్ తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : వ్యాధుల నియంత్రణ కోసం ప్రతీ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ నరేందర్ పిలుపునిచ్చారు. తన ఇంటి పరిసరాలను తన భార్య కౌన్సిలర్ మహేశ్వరితో కలిసి పరిశుభ్ర పరిచారు. కాగా, ప్రతీ ఒక్కరు ఒక్కరు శుక్రవారాన్ని డ్రైడేగా పాటిస్తూ, ఇంటి పరిసరాలను శుభ్రపర్చుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దూరి అశోక్‌గౌడ్ ఓ ప్రకటనలో కోరారు.

కొత్తూర్ : స్వచ్ఛదనం, పచ్చదనంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని కస్తుర్బాగాంధీ పాఠశాల సమీపంలో చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటి నీరు పోశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ డోలీ రవీందర్, కమిషనర్ బాలాజీ, నాయకులు హరినాథ్‌రెడ్డి, జె. సుదర్శన్‌గౌడ్, మహేష్‌గౌడ్, కర్రోళ్ల సురేందర్, పెద్దిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి గ్రామ శివారులోని లాల్‌పహడ్, జడ్పీహెచ్‌ఎస్ చౌదరిగూడ పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం చౌదరిగూడ రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. మండలాధ్యక్షుడు రాజు, నాయకులు చంద్రశేఖర్, వెంకట్ నర్సింహారెడ్డి, గోపాల్‌రెడ్డి, అఫ్సర్, గోపాల్, అన్వర్, అధికారులు తదితరులున్నారు.

కేశంపేట : స్వచ్ఛదనం, పచ్చదనం, వన మాసంలో కార్యక్రమంలో భాగంగా కేశంపేట మండలంలో శుక్రవారం ఒకే రోజు 6075 మొక్కలు నాటారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. కొండారెడ్డిపల్లి, అల్వాల గ్రామంలో ఎంపీడీవో రవిచంద్ర కుమార్ రెడ్డి, సంతాపూర్‌లో తహసీల్దార్ అజాంఅలీ, సంగెంలో డీటీ గీతలు మొక్కలు నాటారు. ఎంపీవో కిష్టయ్య, ఏపీఎం అజీజ్, టీఏ నిలకంఠబాబు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలో చేపడుతున్న పనులను ఆర్‌డీఎంఏ అధికారి శ్రీనివాస్‌రావు పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డులో చేపట్టిన బయో మైనింగ్ పనులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బస్‌స్టాండ్, ఆస్పత్రుల పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకన్నతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొయినాబాద్ : పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. హిమాయత్ నగర్‌లోని పల్లవి ఇంటర్‌నేషన్ పాఠశాలలో మొక్కలు నాటారు. తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఎంపీడీవో సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సంధ్యరాణి, పాఠశాల యాజమాన్యం విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే మొయినాబాద్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో యాదయ్య పాల్గొన్నారు. ప్రత్యేకాధికారి కిషన్‌రావు, ఎంపీడీవో సంధ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

షాబాద్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్, పొల్యూషన్ బోర్డు మెంబర్ సత్యనారాయణ, పీసీసీ కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి అన్నారు. పోతుగల్‌లో మొక్కలు నాటారు. ఎంపీడీవో అపర్ణ, ఎంపీవో శ్రీనివాస్, డీసీసీ ప్రధానకార్యదర్శి భార్గవరామ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు నర్సింహులు, చెన్నయ్య, నాయకులు చల్లా మాధవరెడ్డి, పీసరి వెంకట్‌రెడ్డి, తమ్మలి రవీందర్, కుమ్మరి వేణు, కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : మొక్కలు నాటుతున్న అటవీ రేంజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి. చైర్ పర్సన్ స్రవంతి

చేవెళ్ల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పిచ్చిగడ్డిపై గడ్డిమందును ట్రాక్టర్ సాయంతో అన్ని కాలనీల్లో పిచికారీ చేయించారు. ముడిమ్యాల్ పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, నాయకులు, అధికారులు తదితరులు ఉన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలని చేవెళ్ల మండల మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్ తెలిపారు. ఊరెళ్ల గ్రామంలో మొక్కలు నాటారు.

మహేశ్వరం : గ్రామాల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకొని ఓ ఉద్యమంలా కొనసాగించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్మన్ మధుమోహన్, మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి అన్నారు. తుమ్మలూరు, తుక్కుగూడ మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో మొక్కలు నాటారు. తుమ్మలూరు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీడీవో శైలజ, ఎంఈవో కృష్ణ, కమిషనర్ వెంకట్‌రామ్, ఏపీఎం సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

కులవృత్తుల సంక్షేమానికి పెద్దపీట

ఆమనగల్లు, ఆగస్టు 9: కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం కుల వృత్తుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించే విశ్వకర్మ ఆలయ నిర్మాణ స్థలంలో శుక్రవారం బోరు డ్రిల్లింగ్ పనులను ఎమ్మెల్యే నారాయణ రెడ్డి ప్రారంభించారు. స్వర్ణకారులకు ప్రభుత్వ పరంగా తోడ్పాటునందిస్తామని తెలిపారు. రాష్ట్ర కాలుష్యనియంత్రణమండలి సభ్యుడు బాలాజీ సింగ్, జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, మాజీ సర్పంచ్ కరుణశ్రీ కేశవులు, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కాసోజు రాము, ప్రధాన కార్యదర్శి రవికిరణ్, కోశాధికారి జగదీశ్వరాచారి, నాయకులున్నారు.

త్వరలో వినియోగంలోకి

తహసీల్దార్ కార్యాలయ భవనం

కడ్తాల్, ఆగస్టు 9: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని త్వరలో ప్రారంభించి వినియోగంలోకి తెస్తామని కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్ తెలిపారు. నూతన భవన నిర్మాణం పనులు పూర్తయ్యాయని తెలిపారు. కడ్తాల మండల కేంద్రంలో రూ. 1.18 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని శుక్రవారం తహసీల్దార్ ముంతాజ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి లతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. వారం రోజుల్లో భవనాన్ని ప్రారంభించి వినియోగంలోకి తెస్తామని ఆయన పేర్కొన్నారు. నాయకులు జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, రవీందర్ రెడ్డి, శ్రీను, ఏఈ పరమేశ్, తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్, ఆగస్టు 9: పట్టణంలోని 16వ వార్డులో సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మెన్ నరేందర్ శుక్రవారం ప్రారంభించారు. 16వ వార్డు క్రిస్టియన్ కాలనీలోని పాతూరి వెంకట్‌రావు నివాసం నుంచి న్యాయవాది చెంది తిరుపతిరెడ్డి నివాసం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నారు. చేపట్టిన పనులను శరవేగంగా పూర్తిచేస్తామని చైర్మన్ తెలిపారు. వైస్ చైర్మెన్ నటరాజన్, కోఆప్షన్ సభ్యులు కిషోర్, ప్రముఖ పౌల్ట్రీ వ్యాపారవేత్త పాతూరి వెంకట్‌రావు, పద్మ స్టీఫెన్, వినోద్ జోసఫ్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

● రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్

చేవెళ్ల, ఆగస్టు 9 : ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, మైనర్లు వాహనం నడిపితే వారి ప్రాణాలకే కాకుండా ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదమని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం ఆధ్వర్యంలో సిల్వర్‌డైల్ ద హైస్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు, బస్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై వివరించారు. ఏసీపీ మాట్లాడుతూ.. మైనర్లు వాహపాలు నడిపితే చాలా ప్రమాదకరమన్నారు. ట్రిపుల్ రైడింగ్, మొబైల్ డ్రైవింగ్, అపోట్ డ్రైవింగ్, స్పీడ్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవింగ్ మొదలగు వాటిని ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్‌డ్రైవర్లు జాగ్రత్తగా బస్సులను నడిపించాలని సూచించారు. రూల్స్ ఉల్లంఘిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిగా లక్‌పతి నాయక్

కడ్తాల, ఆగస్టు 9 : మండలంలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన జర్పుల లక్‌పతినాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ ఆసంఘం జాతీయ అధ్యక్షుడు చిన్నబాబునాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబునాయక్‌లు శుక్రవారం నగరంలోని బాబు జగ్జీవన్ రాం భవన్‌లో నియామకపత్రమందించారు. పలువురు నాయకులు లక్‌పతిని సత్కరించారు.

ఘనంగా యూత్ కాంగ్రెస్

ఆవిర్భావ వేడుకలు

ఆమనగల్లు/శంషాబాద్, ఆగస్టు 9: యువజన కాంగ్రెస్ 64వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్‌లు హాజరయ్యారు. కాంగ్రెస్ జెండాను శ్రీకాంత్ ఆవిష్కరించారు. కేక్‌కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. కడ్తాల మండల కేంద్రంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు హీరాసింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కాంగ్రెస్, యవజన నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి యూత్‌కాంగ్రెస్ గుండెకాయ వంటిదని పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు నరేందర్ అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో యూత్ కాంగ్రెస్ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్‌కాంగ్రెస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం అధ్యక్షుడు నాగేందర్, చందూనాయక్, కాంగ్రెస్ శంషాబాద్ మున్సిపాలిటీ ప్రెసిడెంట్ పీఎస్ సంజయ్, మున్సిపాలిటీలోని వివిధ బస్తీయూత్‌లకు చెందిన యూత్ కాంగ్రెస్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

'ధరణి వల్ల రైతులకు తీవ్ర ఇబ్బందులు'

శంషాబాద్ రూరల్, ఆగస్టు 9 : ధరణి వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుల్తాన్‌పల్లి మాజీ సర్పంచ్ ఇస్తారి కలెక్టర్ శశాంక దృష్టికి తీసుకెళ్లారు. కొన్నేళ్లుగా భూ సమస్యలతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఎదుట కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ సమస్యను పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఇస్తారి పేర్కొన్నారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మల్కారం ఫారెస్ట్ భూముల్లో కలెక్టర్, ఎమ్మెల్యేలు హాజరై మొక్కలు నాటారు.

సంక్షిప్తంగా..

షాబాద్ : విద్యార్థులు కష్టపడి చదివి వృద్ధిలోకి రావాలని ఎంఈవో శంకర్‌రాథోడ్, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి అన్నారు. తిర్మలాపూర్ పాఠశాలలో 30మంది విద్యార్థులకు మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి స్కూల్ బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు.

చేవెళ్ల : ఎన్కెపల్లి ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లారు. శుక్రవారం వీడ్కోలు పలుకడంతో పాటు కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలికారు. ఘనంగా సన్మానించారు. ప్రధానోధ్యాయుడు మునీర్‌పాషా, మాజీ సర్పంచ్ రాధ, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

మొయినాబాద్ : న్యాయవాద దంపతులపై జనగామ పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంటు ప్లీడర్ (ఏజీపీ), స్పెషల్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ ప్రభుత్వం తరపు న్యాయవాది భైకని కుమార్‌యాదవ్ డిమాండ్ చేశారు. అమృతరావు, కవిత దంపతుల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించేడమే కాకుండా దాడికి పాల్పడ్డారని ఆరోపించారు.

యాచారం : గుర్తుతెలియని వ్యక్తులు ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతానెంబర్లు అడిగి.. అప్‌డేట్ చేస్తామని ఫోన్ చేస్తారని, వివరాలు చెప్పరాదని ఎస్సై గోపాల్ చెప్పారు. మాల్ ఉన్నత పాఠశాలలో సైబర్‌నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కందుకూరు : బాచుపల్లిలో పనిచేసిన ఉపాధ్యాయులను ఇటీవల బదిలీ చేశారు. శుక్రవారం మాజీ సర్పంచ్ యాలాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. రామకృష్ణారెడ్డి, వాణిశ్రీ, ధనలక్ష్మి, రాజేశ్వరి, గోపాల్‌ను సన్మానించారు.

మంచాల : ప్రధాని నరేంద్రమోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపతకాలపై విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజల అభిమానం పొందాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.లచ్చిరెడ్డి నేతలకు సూచించారు. భారతీయ జనతాపార్టీ మంచాల మండల కార్యవర్గసమావేశం శుక్రవారం జరిగింది. హర్‌ఘర్ తిరంగ అభియాన్‌లో బాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. బీ జేపీ మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాజీ వైస్ఎంపీపీ దన్నెబాషయ్య, చివిరాల పాండు, యువమోర్చా మండల అధ్యక్షుడు బండిరాజు, యాట రమేష్, పిడుగు వెంకటేష్, బిక్షపతి, వెంకట్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్ల కృష్ణ, నర్ర రమేష్, నర్సింహ, సురేష్, ఐలయ్య, వినోద్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : జిల్లా పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆలంఖాన్‌గూడలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ పథకాల సద్వినియోగం తదితర వాటిపై గ్రామస్తులకు పాటలు పాడుతూ అవగాహన కల్పించారు. కళాకారులు అనిల్, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. సాగర్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్‌నో అనే కార్యక్రమం పోలీస్‌లు నిర్వహించారు. ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌అర్బన్ : కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్ సింగ్ పూరీని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్‌లో మంత్రిని కలిసి ఉజ్వల వంట గ్యాస్ కనెక్షన్ లేని పేదలందరికీ ఉజ్వల కనెక్షన్లు ఇవ్వాలని కోరినట్లు శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు.

కొందుర్గు : ఎస్సీ డిక్లరేషన్‌కు నిధులు మంజూరు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు విట్యాల నర్సింహ కోరారు. ఈమేరకు తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

యాచారం : తాటిపర్తిలో అంగన్‌వాడీ భవనం వానాకాలంలో కురుస్తూ చిన్నారులు కూర్చోలేని స్థితిలో ఉన్న వైనంపై ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో అంగన్‌వాడీ భవనం మరమ్మతు చేయరేం అనే శీర్షికన వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. భవనానికి రూ.లక్ష నిధులతో అధికారులు మరమ్మతులు చేయించారు.

చేవెళ్ల : చందనవెళ్లి పారిశ్రామిక వాడలోని రివాల్వ్ టెక్నాలజీస్ ప్రైవేట్ కంపెనీ నిర్వాహకులు అక్రమంగా నక్ష రోడ్డును బంద్‌చేసి ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయులు చేవెళ్ల స్వామి, అంజనేయులు, వడ్ల రాఘవచారి, రాంచంద్రరావు, కిష్టయ్య డిమాండ్ చేశారు. చేవెళ్ల ఆర్డీవో సాయిరాంను కలిసి వినతి పత్రం అందించారు.

షాద్‌నగర్ రూరల్ : ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ రంగస్వామి తెలిపారు. వంద మంది పోలీసులతో శుక్రవారం రాత్రి షాద్‌నగర్ పట్టణం, పరిసర ప్రాంతాలలోని హోటళ్లు, లాడ్జీలు, కిరాణా షాపులు, మొబైల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీ చేశారు.

మంచాల : రుణాలు మాఫీ అయిన రైతులందరూ మళ్లీ కొత్తగా రుణాలను పొందాలని మంచాల పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి సూచించారు. మంచాల వ్యవసాయ సహకార సంఘంలో మాఫీ పొందిన రైతులకు కొత్తగా మంజూరైన పంటరుణ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు.

తలకొండపల్లి : పోస్టల్ పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సబ్ డివిజినల్ ఇనిస్పెక్టర్ రవికుమార్ కోరారు. మండల కేంద్రంలో పోస్టల్ పాలసీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకటేశ్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : నూతనంగా బాధ్యతలు తీసుకున్న రంగారెడ్డి జిల్లా మత్స్య పారిశ్రామిక శాఖ ఏడీ నర్సింహారావును కందుకూరు మండల మత్స్య పారిశ్రామిక సంఘం నాయకులు సన్మానించారు. మండల శాఖ అధ్యక్షుడు లింగంముదిరాజ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌కు వెళ్లి సన్మానించారు.

కందుకూరు : మద్యం, డ్రగ్స్ వైట్‌నర్ లాంటి వాటికి బానిసలు కాకూడదని కందుకూరు కానిస్టేబుల్ మల్లేష్ విద్యార్థులకు సూచించారు. నేదునూరు ఉన్నత పాఠశాల విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైంపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే కొందరు గంజాయి, మద్యానికి బానిసలౌతున్నారని, వారి కుటుంబాలు రోడ్డునపడి ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస శర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కందుకూరు : గత ప్రభుత్వం నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు వెంటనే స్థలాలు చూపాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి.రాంచందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 788, సర్వే నెంబర్‌లో 107లో 300మంది నిరుపేదలకు గత ప్రభుత్వం 2023లో ఇంటి స్థలాల కోసం పట్టాలు ఇచ్చిందని, నేటికీ స్థలాలను చూపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. నిరుపేదలు ఇంటి అద్దె కట్టలేని పరిస్థితుల్లో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించుకొని స్థలాలను చూపి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.